క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

కంబాలచెరువు: ఉగాది సందర్భంగా స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ నగర శాఖ ఆధ్వర్యంలో గీతా అప్సర థియేటర్ సమీపంలోని సోమాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కడియాల సోమరాజు, శ్యామల జ్ఞాపకార్థం ఈ వైద్య ఔషధ సేవా శిబిరం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా కడియాల సోమరాజు కుమారుడు కడియాల వీరభద్ర రావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.సత్యరమేష్, రాష్ట్ర సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ పాల్గొన్నారు.

24న విగ్రహ ప్రతిష్ఠాపన

కడియం: దామిరెడ్డిపల్లిలో కోదండ రామ స్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ ఆలయంలో 24వ తేదీ ఉదయం 10 గంటలకు నూతన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. అదేరోజు అన్నసమారాధన జరుగుతుంది.

క్షతగాత్రుడి ఆరోగ్యంపై ఆరా


లోవరాజు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాత తుంగపాడుకు చెందిన వెంకట లోవరాజును గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అపస్మారక స్థితికి చేరుకోగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితుడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని వైద్యులు తెలిపారు. వెంటనే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వయంగా మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స అందే విధంగా చూడాలని సూచించారు. ఎటువంటి సహాయం అవసరం ఉన్నా వెంటనే సంప్రదించాలని బాధితుడి స్నేహితులకు ఫోన్ నంబర్ ఇచ్చారు.

చక్రపాణికి ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న వేదాంతం చక్రపాణి ఆచార్యులు

కడియం: స్థానిక శ్రీనవజనార్దన స్వామివారి ఆలయ అర్చకుడు వేదాంతం చక్రపాణి ఆచార్యులకు వైఖానస ఆగమ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం అందజేసింది. బుధవారం తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా చక్రపాణి ఆచార్యులు పురస్కారం పొందారు. శాలువా, మెమోంటో, రూ.10,116 నగదు బహుమతిని అందుకున్నారు.

హెడ్గేవార్‌కు ఘన నివాళి


డాక్టర్ హెడ్గేవార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి వెంకటగిరి–2లో స్వాతంత్ర్య సమర యోధుడు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ వ్యవస్థాపకుడు డాక్టర్ బలిరామ్ హెడ్గేవార్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ సహ సంఘ్ చాలక్ రిమ్మలపూడి సుబ్బరాజు పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ హెడ్గేవార్ మహోన్నతుడు అన్నారు. అనంతరం ఉగాది సంబరాల్లో భాగంగా అసిరమ్మ అమ్మవారికి సహస్ర ఘటాభిషేకాన్ని బీజేపీ జిల్లా కార్యదర్శి తనుబుద్ధి సూర్య భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, యానాపు ఏసు, పన్నాల లక్ష్మీసంతోషి, అడబాల రామకృష్ణ, ఏపీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	బలగం
సూర్యమినీ	దాస్‌కాధమ్కీ
సూర్యప్యాలెస్	
	ఫలాన అబ్బాయి ఫలాన అమ్మాయి
స్వామి	దాస్‌కాధమ్కీ
శివజ్యోతి	రంగమార్తాండ
అనుశ్రీ	దాస్‌కాధమ్కీ
రాజా	దాస్‌కాధమ్కీ
అశోక	సార్
ఊర్వశి	కోస్ట్
రంభ	షజామ్
మేనక	క్లోజ్
గీతాఅప్సర	కబ్జా
నామవరం	
విఎస్.మహల్	రంగమార్తాండ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	దాస్‌కాధమ్కీ

అన్నింటా శోభకృతం


ఉగాది సందర్భంగా పూజలు చేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

- కొత్త సంవత్సరంలో ఆనందం వెల్లివిరియాలి
- ఎంపీ మార్గాని భరత్‌రామ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శ్రీశోభకృత్ నామ సంవత్సరంలో ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండాలని ఎంపీ భరత్‌రామ్ ఆకాంక్షించారు. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులో ఉన్న శ్రీవిల్లాలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో తులతూగాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాలు వెల్లివిరియాలని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందేలా మరింత శక్తిని ప్రసాదించాలని ఎంపీ పూజలు చేశారు. అనంతరం లంకాలాధర్‌కు రూ.40 వేల విలువైన మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని ఎంపీ అందజేశారు.

కడియంలో..

కడియం: మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేమగిరిలో పురాతన రామాలయాన్ని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ దర్శించుకున్నారు. కొండాలమ్మ అమ్మవారికి కూడా పూజలు చేశారు. వేదపండితుల ఆశీస్సులు అందుకున్నారు. రామాలయం, కొండాలమ్మవారి ఆలయాల అభివృద్ధికి చందన కృషి చేయడం పట్ల గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు. నాయకులు రంకిరెడ్డి సుబ్బరాజు, పుల్లెపు ఆదినారాయణ, చెరుకూరి వెంకటరామారావు, పుల్లెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కడియంలో దేవీ అమ్మవారి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సిద్ధాంతి దొంతంశెట్టి కాళహస్తీశ్వరరావు పంచాంగ పఠనం చేశారు. అనంతరం కాళహస్తీశ్వర రావు, పురోహితుడు ప్రసాద్‌శర్మను సత్కరించారు. దుళ్లలోని శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు

సీటీఆర్ఐ: రుడా కార్యాలయంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూజ చేసి ఉగాది పచ్చడితో పాటు పంచాంగాలను వచ్చిన అతిథులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అందరూ సుభిక్షంగా ఉండాలని, సీఎం జగనన్న పాలనలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలని ఆకాంక్షించారు. అనంతరం జాంపేట మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షుడు వెలమ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో షర్మిలారెడ్డి కేక్ కట్ చేశారు. గోదావరి గట్టున ఉన్న సరస్వతి ఘాట్ వద్ద శ్రీజ్ఞాన సరస్వతి కళాపీఠం, ప్రభాకర్ నిధి లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ప్రభల సుబ్రహ్మణ్యశర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం డాక్టర్ కర్రి రామారెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్ వడియార్‌తో పాటు పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు.

శ్రీసత్యసాయి మందిరంలో..

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఆల్కాట్‌తోటలోని భగవాన్ శ్రీసత్యసాయి మందిరంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. శ్రీసత్యసాయి అష్టోత్తరం, శ్రీసత్యసాయి గాయత్రి సామూహిక పఠనం, బాలవికాస్ పూర్వ విద్యార్థిని కొఠారు పద్మలతచే వేదపఠనం, సత్యసాయిగీతచే అన్నమయ్య కీర్తనలు, స్వామివారి భజనలు అనంతరం మంగళహారతి నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు. బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.


రుడా కార్యాలయంలో పంచాంగాలను అందిస్తున్న చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు


వేమగిరిలో వేదాశీర్వాదం తీసుకుంటున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్


ఆల్కాట్‌తోట శ్రీసత్యసాయి మందిరంలో పంచాంగ పఠనం

సత్తెమ్మ తల్లీ.. మమ్మేలు


శిరస్సుపై గరగలు పెట్టుకుని అమ్మవారి దర్శనానికి వస్తున్న ఎమ్మెల్యే రాజా తదితరులు

అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం

సీటీఆర్ఐ: స్థానిక నారాయణపురం కాలనీ దేవత సత్తెమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం నారాయణపురం కాలనీలో కొలువైన సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఆలయంలో జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరిగిందని, ఆనాటి నుంచి నేటి వరకూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా జాతరలో విధిగా పాల్గొంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డ పద్మనాభం, ఆదివిష్ణుమూర్తి, మానే దొరబాబు, వద్రపు వెంకటేశ్వరరావు, రెడ్డి ప్రసాద్, తన్నీరు శేఖర్, మానే ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక అప్సరా థియేటర్ వద్ద ఉన్న సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

కడియం: కడియపులంకలో మహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 27న అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

ఆసుపత్రిలో ఉచితంగా చపాతీల పంపిణీ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా చపాతీల పంపిణీని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్ రామ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి నిత్యం అనేక వేల మంది ఏ చిన్న పాటి ఆరోగ్య సమస్య తలెత్తినా వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారన్నారు. వారు మధ్యాహ్న భోజనానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ సమస్యను గుర్తించిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహాయం అందించాలన్న గొప్ప ఆలోచనతో ట్రస్ట్ చైర్మన్ కొత్త సుప్రియ ఆర్థిక సహకారంతో సుమారు రూ.10 లక్షలతో చపాతి తయారీ మిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మధ్యాహ్నం భోజనంలో భాగంగా సుమారు 4 వేల చపాతీలతో పాటు ఒక కర్రీని ఉచితంగా రోగులకు అందిస్తారన్నారు. రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, మేనేజింగ్ ట్రస్ట్ కొత్త రామ్మోహనరావు పాల్గొన్నారు.

జోడెడ్ల బండి.. ఉరకలేసింది

- ఉత్సాహభరితంగా ఎడ్ల పట్టు ప్రదర్శన
- విజేతలకు బహుమతుల ప్రదానం


పోటీ పడుతున్న ఎడ్లు

కడియం: జోడెడ్లు పరుగు పెడుతుంటే.. ఉత్సాహం ఉరకలేసింది.. కడియం మండలం దుళ్ల– వీరవరం రోడ్డులోని శ్రీనందీశ్వర స్వామివారి ఆలయం వద్ద ఎడ్ల పట్టు ప్రదర్శన ఉత్సాహభరితంగా సాగింది. ఏటా ఉగాదికి ఆలయం వద్ద ఎడ్ల ప్రదర్శన ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం వివిధ ప్రాంతాల నుంచి 14 ఎడ్ల జతలు పోటీ పడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తోకలంకకు చెందిన గెడ్డం ప్రసాద్‌కు చెందిన ఎడ్ల జత నిర్ణీత దూరాన్ని 21 సెకన్లలో చేరుకుని మొదటి స్థానంలో నిలిచింది. రాజమహేంద్రవరం రూరల్ నామవరం గ్రామానికి చెందిన ఈలి శ్రీరాములుకు చెందిన ఎడ్లు 22.66 సెకన్లలో చేరుకుని ద్వితీయ స్థానంలో, కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన మిద్దె సురేష్‌కు చెందిన ఎడ్లు 22.81 సెకన్లలో చేరుకుని మూడవ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో విజేతలకు వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మెమోంటో, నగదు బహుమతి, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఏటా పోటీలు నిర్వహిస్తున్న మొగలపు చిన్నను అభినందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, మురమండ సొసైటీ అధ్యక్షుడు ఈదర దీనదయాళ్, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు వెంపాటి గంగారావు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

నందన్నబాబు తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కడియం, ఆలమూరు, కొత్తపేట మండలాలకు చెందిన ప్రజలు భారీ ఎత్తున హాజరయ్యారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాగాలి


ప్రియదర్శిని ఆశ్రమంలో చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ

కంబాలచెరువు: బధిరులమని కుంగిపోకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ అన్నారు. మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో పిల్లలతో ఆయన బుధవారం మాట్లాడారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించాలన్నారు. ఇటీవల మృతిచెందిన ఆయన భార్య జ్ఞాపకార్థం ఆశ్రమంలోని 150 మంది పిల్లలకు అన్నదానం చేశారు. ఆశ్రమానికి తనవంతు సహాయం అందిస్తానని తెలిపారు. ఆశ్రమ నిర్వాహకురాలు స్వప్నవర్మ ప్రిన్సిపాల్ కృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రిన్సిపాల్ కె.ఆశాలత, కె.ప్రేమలత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


మణి సతీష్‌రెడ్డి (ఫైల్)

అనపర్తి: బాలుడు అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం స్థానిక పద్మశ్రీ థియేటర్ ప్రాంతానికి చెందిన మల్లిడి దుర్గాదేవి కుమారుడు మణిసతీష్‌రెడ్డి రాయవరం మండలం లొల్ల మానవతా ఆశ్రమంలో ఏడో తరగతి చదువుతున్నాడు. చదువుపై ఆసక్తి లేదంటూ ఇటీవల ఆశ్రమం నుంచి వచ్చి తల్లి దగ్గరే ఉంటున్నాడు. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం తల్లి నిద్రపోతున్న సమయంలో రూ.200, బట్టల బ్యాగు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాలుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి దుర్గాదేవి బుధవారం అనపర్తి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

కడియం: స్థానిక మేకలదిబ్బ ప్రాంతంలో బుధవారం కోడిపందేలు ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కడియం ఎస్ఐ ఆంజనేయులుకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.2,730 నగదు, రెండు కత్తులు, పది కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు.

వైద్య విద్యార్థి వెంకటేష్ అందరికీ ఆదర్శం


వెంకటేష్‌కు చెక్కులను అందజేస్తున్న నున్న తిరుమలరావు, ఉప్పులూరి సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి బసవ వెంకటేష్ అందరికీ ఆదర్శమని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు అన్నారు. ఆల్ ఇండియా స్థాయి నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో 1,115 ర్యాంక్ సాధించిన సందర్భంగా వెంకటేష్‌ను ఉగాది పర్వదినం సందర్భంగా తొర్రేడు ఓనువులమ్మ ఆలయంలో సత్కరించారు. తిరుమలరావు, వెంకటనగరం మాజీ సర్పంచ్ ఉప్పులూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై వెంకటేష్‌ను పులమాలలతో సత్కరించారు. తిరుమలరావు మాట్లాడుతూ పదో తరగతి వరకూ తొర్రేడులో తెలుగు మీడియంలో చదువుకుని ఈ స్థాయికి రావడం గర్వకారణమన్నారు. నున్న తిరుమలరావు, ఉప్పులూరి సత్యనారాయణలు నగదు బహుమతిని చెక్కుల రూపంలో అతనికి అందజేశారు. వైద్య విద్యార్థి వెంకటేష్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి చేరడానికి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు, ఉప్పులూరి సత్యనారాయణ కారణమన్నారు. ఎంసెట్‌లో 2016లో 700 ర్యాంకుతో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశానని, పీజీలో ఎండీ రేడియేషన్ కోర్సు చేయాలని ఉందన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అంతకు ముందు నున్న తిరుమలరావును సత్కరించారు.